AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

28-11-2025 (Friday) MAIN EDITION

## అ'ధర'గొట్టిన సుదీప్ ఫార్మా..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్ :** గుజరాత్‌లోని వడోదరకు చెందిన సుదీప్ ఫార్మా ఐపీవో అ'ధర'గొట్టింది. కంపెనీ షేర్లు శుక్రవారం ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్టయ్యాయి. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరును గరిష్ట ప్రైస్ బ్యాండ్ వద్ద రూ. 593కు ఆఫర్ చేయగా.. రూ. 137 ప్రీమియంతో రూ. 730 వద్ద లిస్టయ్యింది. అంటే ఐపీవో అలాట్ అయినవారికి లిస్టింగ్ సమయంలోనే 23 శాతం లాభాలు వచ్చాయన్న మాట.

## తిరుమలలో సాధారణ భక్తుల దర్శనం వేగవంతం..



**అక్షరటుడే, తిరుమల:** తిరుమలలో సామాన్య భక్తులకు మరింత వేగంగా, ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ అధికారులకు ఆదేశించారు. భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని, టీటీడీ ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసి మరింత పారదర్శకతను తీసుకురావాలని సీఎం సూచించారు. అలాగే అన్ని టీటీడీ సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌లోకి తీసుకువచ్చే దిశగా చర్యలు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

## డిసెంబర్ 3 నుంచి మీషో ఐపీవో





**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** సాఫ్ట్‌బ్యాంక్ మద్దతు కలిగిన ఇ-కామర్స్ సంస్థ మీషో రూ.5,421 కోట్ల ఐపీవో డిసెంబర్ 3న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. డిసెంబర్ 5న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.105-111గా నిర్ణయించింది. షేరు గరిష్ఠ ధర వద్ద రూ.50,096 కోట్ల విలువతో కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది.

## ఉనికి కోసం బీఆర్ఎస్ దీక్షా దివస్



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఉనికి కోసం బీఆర్ఎస్ దీక్షా దివస్ చేయాలని చూస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. కేసీఆర్ దీక్ష ఎలా చేశాడు.. అప్పుడు ఏం జరిగిందో అందరికి తెలుసన్నారు. కేసీఆర్ దీక్ష ఓ నాటకమని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు ప్రాణత్యాగాలు చేస్తే తెలంగాణ ఏర్పడిందన్నారు.

## ఇరుముడితోనే విమాన ప్రయాణం



**అక్షరటుడే, ఢిల్లీ:** అయ్యప్ప స్వాములకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఇరు ముడితో విమాన ప్రయాణం చేయడానికి అనుమతి ఇచ్చింది. భక్తుల విశ్వాసానికి విలువ ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటన చేశారు. ఇరుముడిని చెక్ ఇన్ లగేజీగా పంపాలన్న నిబంధనలు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

## చాపకింద నీరులా స్క్రబ్ టైఫస్ కేసులు..

**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ కేసులు వేగంగా పెరుగుతుండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా చిత్తూరు, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో ఈ వ్యాధి ఎక్కువగా బయటపడుతోంది. ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఉండే చల్లని వాతావరణంలో స్క్రబ్ టైఫస్ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెద్దలు మాత్రమే కాదు, చిన్నారులు కూడా ఈ వ్యాధికి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. స్క్రబ్ టైఫస్ అనేది ఒరియెంటియా సుట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే అంటువ్యాధి. ఇది చిన్న నల్లులు (చిగ్గర్స్) కుట్టడం ద్వారా వ్యాపిస్తుంది.

## చిరంజీవి ట్రస్ట్‌కు ఎఫ్‌సీఆర్ఏ ఆమోదం..

**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రముఖ సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి మెగాస్టార్ చిరంజీవికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం శుభవార్త అందించింది. చిరంజీవి నిర్వహిస్తున్న సేవా సంస్థ 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్'ను ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదు చేసేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆమోదం తెలిపినట్లు సమాచారం. తాజాగా కేంద్ర హోం శాఖ నుంచి వచ్చిన ఎఫ్‌సీఆర్ఏ ఆమోదంతో ఇప్పుడు చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ విదేశీ విరాళాలను అధికారికంగా స్వీకరించే అవకాశం కలుగుతుంది. విదేశీ నిధులను స్వీకరించే ఏ ఎన్జీవో అయినా 2010 ఎఫ్‌సీఆర్ఏ చట్టం కింద నమోదు కావాల్సి ఉంటుంది.



# అందరం లొంగిపోతాం

- మావోయిస్టుల సంచలన లేఖ
- జనవరి 1న ఆయుధాలు వీడతామని ప్రకటన
- కూంబింగ్ ఆపేయాలని విజ్ఞప్తి

మావోయిస్ట్ ఉద్యమం చివరి దశకు చేరింది. ఒకప్పుడు సామాంతర పాలన సాగించిన నక్సల్స్ ప్రస్తుతం ఉనికి కోల్పోయారు. అడవులను కంచుకోటలుగా చేసుకున్న అన్నలకు ప్రస్తుతం సేఫ్ జోన్లు కరువయ్యాయి. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్ట్ పార్టీ బలహీనం అయింది. కీలక నేతల ఎన్‌కౌంటర్లు, లొంగుబాటుతో కేడర్‌లో నిస్తేజం అలుముకుంది. ఈ క్రమంలో మిగతా వారు సైతం లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. జనవరి 1న అందరం లొంగిపోతామని మావోయిస్టులు తాజాగా లేఖ విడుదల చేశారు.

**—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

మావోయిస్టులు మరో సంచలన ప్రకటన చేశారు. తాము వచ్చే ఏడాది జనవరి 1న ఆయుధాలు వీడుతామని ప్రకటించారు. ఈ మేరకు మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ విడుదల చేశారు. కొంతకాలంగా మావోయిస్టు పార్టీ బలహీనంగా మారింది. ఆపరేషన్ కగార్ దెబ్బకు చాలా మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. కీలక నేతలు సైతం హతం అయ్యారు. మరోవైపు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులతో పాటు పలువురు మావోలు లొంగుబాట పట్టారు. ఇటీవల లొంగిపోయే మావోయిస్టుల సంఖ్య పెరిగింది. మరోవైపు కీలక నేత హిడ్మా సహా టెక్ శంకర్ మృతితో ఆ పార్టీకి పెద్ద తగిలింది. దీంతో తాము ఆయుధాలు వీడటానికి కొంత సమయం ఇవ్వాలని ఇటీవల మావోయిస్టులు లేఖ రాశారు. తాజాగా లొంగిపోయే తేదీని ప్రకటించడం గమనార్హం.

### అందరం కలిసి..

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట మావోయిస్టులు నిత్యం లొంగిపోతున్నారు. ఆపరేషన్ కగార్‌తో బలగాలు అడవుల్లోకి చొచ్చుకువస్తుండటంతో మావోలకు షెల్టర్ జోన్లు కరువయ్యాయి. ఒకప్పుడు నక్సల్స్‌కు కంచుకోటగా ఉన్న ప్రాంతాలను సైతం బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో పాటు పోలీసులు, ప్రభుత్వాలు లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో నిత్యం చాలా మంది సరెండర్ అవుతున్నారు. దీంతో ఒక్కొక్కరుగా లొంగిపోయే బదులు, అందరూ కలిసి లొంగిపోతామని తాజాగా మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. తమకు ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వం ఎదుట ఆయుధ విరమణ చేస్తామని తెలిపారు.

### హిడ్మా ఎన్‌కౌంటర్‌తో..


మావోయిస్ట్ పార్టీ అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటుతో పాటు హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనం అయిందని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో లొంగిపోవాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎంఎంసీ జోన్ పరిధిలో మావోయిస్టులు చర్చించడానికి ఓపెన్ ఫ్రీక్వెన్సీ నంబర్ కేటాయించారు. అంతేగాకుండా జనవరి 1 వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు కూంబింగ్ ఆపేయాలని కోరారు. తమ వైపు నుంచి కూడా ఎలాంటి హింసాత్మక ఘటనలు చేపట్టొద్దని సూచించారు.

## పోలీసుల అదుపులో దేవ్‌జీ!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్ట్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నారని దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆరోపిస్తోంది. ఆయనతో పాటు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారని పేర్కొంది. వారిని కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు లేఖ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఇటీవల ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కీలక నేత మాడ్వి హిడ్మా, ఆయన భార్య రాజే, టెక్ శంకర్ సహా పలువురు మృతి చెందారు. అనంతరం తెలంగాణ పోలీసుల ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఆ సమయంలో దేవ్‌జీ కూడా లొంగిపోతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్ సహా పలువురు సరెండర్ అయ్యారు. హిడ్మా ఎన్‌కౌంటర్ సమయంలోనే దేవ్‌జీ సహా 50 మందిని అదుపులోకి తీసుకున్నారని మావోయిస్టులు ఆరోపిస్తున్నారు.

## జీపీ ఎన్నికలపై స్టే విధించలేం: హైకోర్టు





**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. తొలి దశలో భాగంగా రెండో రోజు అధికారులు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. అయితే పలువురు రిజర్వేషన్ల అంశంపై హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో 46 పై హైకోర్టులో విచారణ సాగింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని ధర్మాసనం పేర్కొంది. సబ్ కేటగిరి రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలను రద్దు చేయాలని కోరుకుంటున్నారా అంటూ పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండొద్దని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ గతంలో ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. దీని విచారణ సందర్భంగా పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించమని తామే చెప్పాం కదా అని కోర్టు వెల్లడించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో 46 జారీ చేసింది. దీనిపై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ బీసీ కులసంఘాలు న్యాయస్థానంలో పిటిషన్ వేశాయి. బీసీలలో ఏబీసీడీ వర్గీకరణ ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిపై విచారణ చేపట్టిన న్యాయస్థానంలో స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం జరగనున్నాయి.

## భారత్ బెదిరింపులకు తలొగ్గదు



**అక్షరటుడే, కర్ణాటక :** భారత్ బెదిరింపులకు తలొగ్గదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కర్ణాటకలోని ఉడిపి శ్రీ కృష్ణ మఠంలో జరిగిన లక్ష కంఠ గీతా పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజలు తొమ్మిది తీర్మానాలు తీసుకోవాలని మోదీ సూచించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. నీటిని సంరక్షించడం, చెట్లను నాటడం, ఒక పేద వ్యక్తిని ఉద్ధరించడం, స్వదేశీని స్వీకరించడం వంటి తీర్మానాలు చేసుకోవాలన్నారు. లక్ష కంఠ గీతా పారాయణం నిర్వహించినందుకు మఠం పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీని మోదీ అభినందించారు. దేశంలో గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు ప్రభుత్వాలు ఏమి చేయలేదన్నారు. కానీ ప్రస్తుతం భారత్ ఎవరి ముందు తలవంచదని పేర్కొన్నారు. దేశ రక్షణ విషయంలో తాము ఎన్నటికి వెనకడుగు వేయమని చెప్పారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో ప్రపంచం మన సంకల్పాన్ని చూసిందన్నారు.

## దూసుకొస్తున్న దిత్వా తుపాన్



**అక్షరటుడే, హైదరాబాద్:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి తుపాన్‌గా మారింది. దీనికి దిత్వా అని పేరు పెట్టారు. ప్రస్తుతం శ్రీలంక తీరానికి 200 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. దిత్వా తుపాన్ గంటకు 15 కి.మీ. వేగంతో భారత్‌వైపు దూసుకు వస్తోంది. ఆదివారం తెల్లవారుజాము వరకు నైరుతి బంగాళాఖాతం తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు తుపాన్ చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. దిత్వా తుపాన్ కారణంగా తెలంగాణలో చలిగాలులు పెరగనున్నాయి. నవంబర్ 28 రాత్రి నుంచి నవంబర్ 30 వరకు ఉత్తర, మధ్య తెలంగాణలో బలమైన శీతల వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు.

## పేదల కోసం ఇందిరమ్మ క్యాంటీన్లు: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో పేదల కోసం ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలో బతుకు దెరువు కోసం ఎంతో మంది పొట్ట చేత పట్టుకొని వస్తారని మంత్రి తెలిపారు. పనులకు వెళ్లే వారికి వీలుగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాజు వెడ్స్ రాంబాయి హీరోయిన్ చాలా స్పీడ్..



చిన్న సినిమాగా వచ్చిన ఈ చిత్రం పెద్ద హిట్ సాధించడంతో పాటు, గ్రామీణ అమ్మాయి పాత్రలో పూర్తిగా మేకప్ లేకుండా నేచురల్‌గా కనిపించిన తేజస్వి నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా విలేజ్ లుక్, సహజమైన ఎమోషన్ సీన్లు ఆమెకు మంచి పేరు తీసుకువచ్చాయి. ఈ విజయంతో వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్న తేజస్వి, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన చిన్ననాటి ఘటనను , 'ఫస్ట్ కిస్' అనుభవాన్ని పంచుకుంది. తేజస్వి రావు చెప్పిన వివరాల ప్రకారం.. ఫస్ట్ క్లాస్‌లో చదువుతున్న సమయంలో క్లాస్‌లో తన పక్కనే కూర్చున్న ఒక బాలుడు ఎరేజర్ నేలపై పడేయగా, దాన్ని తీసివ్వమని అడిగాడు. దాంతో నేను తీద్దామని బెంచ్ కిందకు దిగితే ఆ బాలుడు కూడా దిగిపోయి తన బుగ్గపై ఒక్కసారిగా కిస్ చేశాడని తెలిపింది. చిన్నపిల్లల అమాయకత్వంలో జరిగిన ఆ సంఘటన అప్పటికి తమకు కిస్ అంటే ఏమిటో కూడా తెలియని వయస్సు కావడంతో, అది కేవలం ఒక క్యూట్ మూమెంట్‌గా మిగిలిపోయిందని ఆమె చెప్పింది.

**—అక్షరటుడే, సినిమాడెస్క్**